# రాజర్షి

సచ్చిదానందులవారు తమ జీవితంలో ఓ నూతనాధ్యాయాన్ని సాధ్యమైనంత త్వరగా విరచించి తీరాలనే దృఢ నిశ్చయానికి వచ్చేరు.

ఆ నిశ్చయానికి కేంద్రం పుష్పకాశీలో ఎవరో, ఏనాడో సకల హక్కులతోనూ వ్రాసి యిచ్చిన అయిదెకరాల నేల.

సకుటుంబంగా పుష్పకాశీలో ప్రశాంత జీవనం గడపాలనేది తదాదిగా సచ్చిదానందులవారు పెంచి పోషించుకుంటూ వచ్చిన సుందర స్వప్నం.

సచ్చిదానందులవారు రిటైరై ఇంకా రెండు నెలలన్నా దాటలేదు. ఆత్మబంధువు లాంటి ఆ విద్యాలయాన్నాయన వదలలేక వదలలేక వచ్చారే గాని, వస్తూ వస్తూ తనవెంట గ్రామీణులందరి అభిమానాన్ని మూటగట్టుకు మరీ వచ్చేరాయన.

ఇహ మిగిలింది తన చిరవాంఛితాన్ని వాస్తవం చేసుకోవటం.

పుష్పకాశీలో పర్ణశాల నిర్మించుకొని, నాగరికత్రు నెరుగని ఆ నేలమీద బంగారం పండిస్తూ, ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవనం గడపదలచటం దానికి నాంది.

కాని ... కాని ...

పుష్పకాశీలో వన పుష్పాలసంఖ్యాకంగా ఉన్నమాట నిజమే గానీ, కాశీ అనేది పేరులోతప్ప కనుపించనిది.

ఇంతకీ పుష్పకాశీ అనేది ఆ సమీపంలోని కీకారణ్యంలో ఓభాగం. ఆ పరిసరాల్లో నివసించని వన్య మృగం అంటూ లేదుమరి.

ఐతే...

సచ్చిదానందులవారి నిశ్చయం దృఢమైనది.

అకుంఠితమైన ఆత్మ విశ్వాసంగల మనిషి ఆయన.

ఆ అటవీ పరిసరాన్ని తన పాలిట బృందావనంగా మార్చుకోగల ననేది వారి ప్రగాఢ విశ్వాసం.

కనుకనే ఆలోచనకు కార్యరూపమివ్వటంలో వారేమీ తడబడలేదు.

సంగతి తెలిసిన హితులూ, ఇరుగు పొరుగువారూ పరామర్శించ వచ్చేరు.

సుపరిచిత మందహాసంతో స్వాగతమిచ్చేరు సచ్చిదానందులవారు.

"పుష్పకాశీ పరిసరమంతా కీకారణ్యం. అక్కడ క్రూరమృగాలు అసంఖ్యాకంగా ఉన్నాయిగదా!" అన్నారు ఆ వచ్చినవారు.

మరో చిరుమందహాసాన్ని వదిలేరు సచ్చిదానందులవారు.

"మరి, మీరక్కడ నిర్మించుకున్న కుటీరానికి చుట్టూ ఓ కంచె నయినా ఎందుకు వేయలేదు?" ప్రశ్నించేరు వారు.

నిర్లిప్త వదనంతో సచ్చిదానందులవారు సెలవిచ్చేరు.

"మన పవిత్రగ్రంథాలను మీ కనేకసార్లు చదివి వినిపించానుగదా? భయం అనేది నీలోనే వుంది అనిగదా అవి ప్రబోధిస్తున్నది!" అన్నా రాయన.

"అదీ నిజమే! తమరు వీటి కతీతులనటంలో మాకు సందేహం లేదు. కాని, మీ గృహిణి మాత్రం కేవలం ఒక స్త్రీ. ఇహ బిడ్డలా! ఇద్దరూ

ఇంకా పసివాళ్ళే. పైగా గొడ్డు, గోదా తమవెంట ఉండనేఉంటాయి. తమ రక్కడ వ్యవసాయ మారంభించి బంగారం పండించనున్నారుడగదా !"

"అవును !"

"అయ్యో ! మేం భయపడుతున్నది ఆ మిగిలిన విషయాల్లోనే !"

"మీ భయాలు ఆధారరహితాలు కావు. సకల ప్రాణులు కలసి మెలసి సహజీవనం నెరపగలవనేది ప్రకృతి నిర్ణయం, దైవశాసనం !" అన్నారు సచ్చిదానందులవారు.

"కావచ్చు ! మాకెలా అర్ధమవుతుంది !" అన్నారు వారేకగ్రీవంగా.

ఆ విధంగా ఆ సమావేశం అఖరయింది.

"పాపం ! మంచివాడు !" అనుకున్నారు వారందరూను.

* * * *

కాని ఆ సంభాషణ సచ్చిదానందులవారి గృహిణిని కదలించి వేసింది.

ఆమె సచ్చిదానందులవారి అర్ధాంగి. భర్త ఎన్నడూ పొరపాటు చేయడనేది ఆమె నమ్మకం.

కాని...కాని...

ఓ రాత్రివేళ, పిల్లలిద్దరూ నిద్రలో మునిగాక ఆమె సవినయంగా మనవిచేసుకున్నది !

"మనవెంట కనీసం ఓ రెండు జాగిలాలనయినా తీసుకుపోవటం మంచిదిగదా !" అన్నదామె.

"ఎందుకు ?..."

తడబడిందామె.

"మరేంలేదు ! నా కలా అనిపించింది. అంతే !"

"సత్యా! నన్ను విశ్వసించు! వటవృక్షచ్ఛాయలలోనే వత్సరాల తరబడి జీవించిన మన ఋషిపుంగవులను గూర్చి నీవు వినలేదా!"

"అవును...!"

''వారి ఆశ్రమాల్లో, లేళ్ళూ, తోడేళ్ళూ, ఆవులూ, పులులూ కలసే జీవించేవిగదా!"

''అయితే జాగిలాలకు బదులు చిరుతపులుల్నే తోడుగాఉంచుకుందామంటారు మీరు?''

''ఎబ్బే! కేవలం ఉదాహరణలు చెపుతున్నాను. మన పూర్వ సంస్కృతీ సాంప్రదాయాలంత గొప్పవి మరి!''

''అవును. కాని...''

''చింతించకు సత్యా! మనలోని కోరికల పర్యవసానాలే ఈ భయాలు. మన ఆత్మశక్తేగనుక దృఢమైనదయితే, మన మార్గం సరైనదయితే మనమెలా భయపడుతాము? ఎందుకు భయపడాలి?''

అంగీకారంగా తలూపిందామె.

"సత్యా! నీవు తెలివైనదానవు. సులభంగా అర్థం చేసుకోగలవు!"

సంతృప్తిగా ముందున్న రామాయణంమీదికి దృష్టిని పోనిచ్చేరు సచ్చిదానందులవారు. 'సుందర కాండ'లో మనసును లగ్నం చేశేరు.

* * * *

పిల్లలిద్దరూ కోతి కొమ్మచ్చు లాడుకుంటున్నారు.

నూతనాశ్రమంలోనూ, ఆ పరిసరాల్లోనూ ఎక్కి దూకటానికీ, విరగ్గొట్టానికీ చెట్లకేం కొదువలేదు వాళ్ళకు.

ఆ కవల పిల్లలను రామలక్ష్మణులని ముద్దుగా పిలుచుకుంటుంది సత్యవతి. వారిద్దరి జన్మలమధ్యా కొద్ది నిమిషాలే వ్యవధి.

ఆశ్రమవాసం సుఖంగా, ప్రశాంతంగా సాగిపోతూన్నది.

చుట్టుప్రక్కల గ్రామాలనుండి కూలీలను ప్రోగుజేసి, భూమిని చదునుచేసి వ్యవసాయం ప్రారంభించేరు సచ్చిదానందులవారు. గృహాంగణంలో రకరకాల కూరల పాదులూ, అరటి, మామిడి, కొబ్బరిమొక్కలూ నాటేరు. ఏడాది పొడవునా కూరలకు లోటులేకుండా ఏర్పాట్లు జరిగాయి.

పిల్లలకు తేనెఉంటే మరేం అక్కర్లేదు. సచ్చిదానందులవారికి తేనెటీగల పెంపకపు రహస్యం కరతలామలకం.

సచ్చిదానందులవారికి ఆయుర్వేదం తెలుసు. వన మూలికలకా పరిసరాల్లో కొదువలేదు. అడవిలో అక్కడక్కడా విసరేసినట్లుగా ఉన్న ఆ చిన్న చిన్న పల్లెలన్నిటికీ ఆయనే వైద్యుడు.

ఇంకేం కావాలి.

ఎరిగిన వారందరికీ ఆయనపై గౌరవం పెరుగసాగింది. అది భక్తిగా రూపు సెందటానికి ఎంతోకాలం పట్టలేదు.

"ఆయన ఆత్మశక్తి మహత్తరమైనది. కనుకనే ఏ వన్య ప్రాణీ, క్రూరమృగమూ ఆయన దరిదాపులకే పో సాహసించటం లేదు !" అనుకో సాగేరు, అంతకుముందే వాటివల్ల ఏదో విధంగా దెబ్బతిన్నవారు.

వారిలో ఓ పెద్దమనిషి ఆ మాట పైకే అనేశాడు. "మీరు ఋషితుల్యులు ! నిజాని కంతకన్నా ఎక్కువే కూడాను !'' అన్నాడాయన.

సచ్చిదానందులవారి వదనంపై సుపరిచితమైన ఆ మందహాసమే ఓ క్షణం వెలిగి మాయమైంది.

''అది చాలా పెద్దమాట ! మనం కేవలం జీవనసమరంలో నిమగ్నులమై ఉన్న మానవమాత్రులం" అన్నారాయన.

"మీరేమన్నా అనండి. మా దృష్టిలో మాత్రం మీరు మహోన్నతులు !" అన్నాడా పెద్దమనిషి.

ఆ మందహాసమే మరలా జవాబయింది.

"కాకపోతే పులులూ, సింహాలూ ఈ ఛాయలకే రా సాహసించటం లేదెందువల్ల? అదుపులేని అడవిఏనుగులకు మీ క్షేత్రమే సరిహద్దయి పోయిందెందువల్ల? చిలువలూ, త్రాచులూ ఈ పరిసరాల్లో ఊపిరి తీయటానికే ధైర్యం చేయటంలేదుగదా! ప్రశాంతత మీ చుట్టూ గూడు కట్టుకున్నదిగదా! వేదకాలపు ఋష్యాశ్రమాల్లోసైతం ఇలాంటి వాతావరణం ఉన్నట్లు మేము వినలేదే!" అన్నాడా పెద్దమనిషి.

సచ్చిదానందులవారు నిర్లిప్తతతో మౌనం వహించారు.

అందువల్లనే మేము తమరిని 'స్వామిజీ' అని పిలుచుకుంటున్నాం. అలాగే పిలువదలిచాం. అన్నాడాయన.

"అదలా ఉండనివ్వండి. మనం మరేదయినా మాట్లాడుకుందాం" అన్నారు సచ్చిదానందులవారు.

*        *        *        *

సచ్చిదానందులవారి ఔన్నత్యాన్ని ఆయన తోటివారు త్వరగానే గుర్తించేరు.

కాని, వన్యప్రాణుల కంతటి విజ్ఞత ఎక్కడిది!

ఓ సుప్రభాతాన కొన్ని ఎలుగుబంట్లు సచ్చిదానందులవారి సుక్షేత్రంలో సరదాగా విహరించి మొదటిసారిగా ఆయన మనస్తాపానికి కారణమయ్యేయి.

మరో రోజున ఓ కరిరాజు ఠీవిగా ఆ గృహాంగణాన్నే పావనంచేసి అప్పుడే పక్వానికొస్తూన్న గెలతో సహా అరటిచెట్టును పీక్కుపోయి సంతృప్తిగా ఆరగించేడు.

మర్నాడా కరిరాజు మరింత చొరవగా ముందుకొచ్చి ఇంటి కప్పు మీది లేలేత గుమ్మడికాయల్ని ఆరగించి, చాలకకోపంవచ్చికాబోలు కప్పులో కొంతభాగం పీకి పోగులుపెట్టి మరీ వేంచేసేడు.

ఓ సంధ్యా సమయాన నల్లత్రాచొకటి వంటగదిలో షికార్లుకొట్టి మాయమయింది.

ఆ రాత్రే ఓ చిరుత పశువులపాకలో దూరి ఓ ఆవుదూడను సుతారంగా ఈడ్చుకుపోయి విందు చేసుకున్నది.

ప్రతిసారీ సత్యవతి భర్తను ప్రశ్నించేది- "ఇవి ఇలా ఎందుకు జరుగుతున్నాయి?" అని.

సచ్చిదానందులవారివద్ద అందుకు సరైన జవాబు సిద్ధంగాలేదు. "పీటికి అడవిలో ఏదో జరుగుతున్నట్లున్నది!" అనేవారాయన. అంతకుమించి మరే ఆలోచనా రాలేదు సచ్చిదానందులవారికి.

* * * *

ఓ సంధ్యవేళ వంటపని చూసుకుంటూన్న సత్యవతి, రామలక్ష్మలుల భయపూరితమైన కేకలకు అదరా బాదరా బయటకు వచ్చి చూసేసరికి ఓ తోడేలు గృహాంగణంలో- ఉన్నది. దానినోట లక్షణుడి కాలు ఉన్నది. లోగ్లాపడి ఈడ్చుకుపోబడుతూన్న లక్ష్మణుడు ప్రాణభీతితో కంపించిపోతూ ఉన్నాడు.

సత్యవతి మండుతూన్న కుంపటి ఉన్నపళంగా ఎత్తితెచ్చి ..ఆ... తోడేలుమీద గుమ్మరించింది. ఇంతలో స్వామి సచ్చిదానందులవారు గునపంతో పరుగెత్తుక వచ్చారు.

తోడేలు తోక ముడిచింది.

సచ్చిదానందులవారు లక్ష్మణుడి గాయాలకు మౌనంగా కట్లుకట్టేరు.

శోకిస్తున్న సత్యవతిని ఊరడించేరు.

ఓ మూలకుపోయి భగవద్గీతను తిరగవేయసాగేరు.

అస్త్రసన్యాసం చేసిన అర్జునునికి శ్రీకృష్ణపరమాత్ముల వారేం బోధించేరు?

* * * *

స్వామీ సచ్చిదానందులవారు కదిలేరు.

ఇంటిచుట్టూ, పొలంచుట్టూ కంచెలు లేచేయి.

ఓ తుపాకీ సర్వకాలాలా ఆయనవెంట ఉంటూన్నది.

రెండు దున్నల్లాంటి వేటకుక్కలు తోడయినాయి.

రోజూ ఉదయమే ఆయనచేసే ప్రార్థన మారిపోయింది.

"నీ లీలలను గురించి ఘనంగా వర్ణించేను. నీ సృష్టిలోని వైచిత్రిని గురించి ప్రగల్భాలాడేను. ఎంత బాధాకరమైన గుణపాఠాన్ని నేర్పేవు భగవాన్! నేను అనాడగరికుణ్ణిగా మారిపోతున్నానా! నా ఈ ప్రార్థన అర్థరహితమా! భగవాన్ నన్ను క్షమించు!

* * * *

అదే సమయంలో పరిసర గ్రామాల పెద్దలు మరోసారి స్వామీ సచ్చిదానందులవారి దర్శనానికి వచ్చేరు.

"ఏమిటి? నావల్ల నేమయినా సాయం కావలసిఉన్నదా?" అని స్వాగతం పలికేరు సచ్చిదానందులవారు.

"లేదు! కాని, ఇటీవల మీరు తీసుకున్న చర్యలు మాకు సంతృప్తి నిచ్చేయి, ఆ విషయం విన్నవించుకునేందుకు వచ్చాము!" అన్నారువారు.

సచ్చిదానందులవారు మందహాసం చేసేరు. కాని, అది వారికి గతంలో సుపరిచితమైనదిగా గోచరించలేదు.

ఆయన గుండెలను పిండుతూన్న సంఘర్షణను వారా మందహాసంలో గుర్తించలేరు మరి!

*   *   *   *

వన్యప్రాణులు సామాన్యమానవులంత విజ్ఞతగలవి కాదనేది మరోసారి రుజువయింది.

స్వామీ సచ్చిదానందులవారిలో వచ్చిన మార్పును ఆయన తోటివారు గుర్తించినంత తేలికగా అవి గుర్తించలేకపోయాయి.

లక్ష్మణుడి రక్తం కొంత రుచిచూసిన తోడేలు ఈసారి సోదర సమేతంగా ఆ పరిసరాలను పావనంచేయ జూచింది.

మర్నాడు వాటి కళేబరాన్ని అడవిజంతువులు ఈడ్చుకుపోవలసి వచ్చింది.

కంచెనుదాటి రాజూచిన ఇతర జంతువులకు సచ్చిదానందులవారి తుపాకి గర్జనలు పాఠం నేర్పాయి.

అంతటి సాహసానికవి మళ్ళీ పూనుకోలేదు

*   *   *   *

వేటను మించిన సరదాయైన పనిలేదు కొందరికి.

ఓసారి గురిలో పేరుమోసిన ఓ రాజుగారు వేటాడటానికి పుష్పకాశికి వేంచేశారు.

అనుపానుల్నిగూర్చి ఆయన గ్రామీణుల్ని వాకబుచేశారు.

"స్వామీ సచ్చిదానందులవారిని అడగండి!" అన్నారు వారందరూనూ.

"ఎవరాయన? స్వామీజీయా?" ఆశ్చర్యంతో, సందేహంతో ప్రశ్నించేరు రాజావారు.

''అవును! వారికన్నా తెలిసిన వారెవరూ లేరీ విషయంలో!" అన్నారు వా రేకగ్రీవంగా.

*   *   *   *

రాజావారు ఘనంగా వేటాడారు. వారం పదిరోజులపాటు అడవంతా తుపాకుల గర్జనలతో దద్దరిల్లిపోయింది.

వీడ్కోలిస్తూ రాజావారు స్వామి సచ్చిదానందులవారితో అన్నారు.

"నే ననేకచోట్ల, అనేక రకాలవారితో కలిసి వేటాడేను. కాని, మాటువేయడంలో, గురి చూడటంలో. జంతువుల అలికిడిని పసికట్టటంలో మిమ్మల్ని మించినవారిని నే నింతవరకూ చూడలేదు!" అన్నారాయన.

సచ్చిదానందులవారు చిరునవ్వుతో వీడ్కోలిచ్చారు. కాని, ఆయన మనసు ఆయనకే అవగతంకాని దేనితోనో ఘర్షణ పడుతున్నట్లున్నది. అందుకే,

''ఇప్పుడెంతో ప్రశాంతంగా ఉందిగదూ" అన్న సత్యవతి మాట లాయన చెవి దూరలేదు.

('నిరంజన' కన్నడ కథకు స్వేచ్ఛానువాదం)

★